

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

**మేఘా ఛాయే ఆధీ రాత్**

**బైరన్ బన్‌గయీ నిందియా**

**బతాదే మై క్యా కరూన్?**

1970 దశకంలో, హిందీ సినిమా రూపు రేఖలు, సినీగీతాల ధ్వనులు మారుతున్న సమయంలో, తాను మాత్రం మారనని, మలుపు తిరిగే దారులతో మలుపులు తిరిగినా మౌలిక సంగీత సృజనలో మార్పు రాదని సంగీత దర్శకుడు ఎస్డీ బర్మన్ స్పష్టంగా ప్రకటించిన పాట ఇది. మారుతున్న కాలం మార్పు అడుగులో అడుగు కదిపి ప్రయాణించినా, మౌలికమైన సంగీతపు ఆత్మ మారలేదని ఈ పాటతో ఎలుగెత్తి చాటాడు ఎస్డీ బర్మన్.

'షర్మీలీ' సినిమాలోనిది ఈ పాట. ఒక కీలకమైన సన్నివేశంలో వస్తుంది. షర్మీలీ అంటే 'సిగ్గుపడే అమ్మాయి' అని అర్థం. ఇది 'గుల్షన్ నందా' నవల. ఆ కాలంలో గుల్షన్ నందా నవలలు సినిమాలయ్యేవి. ఆయన సినిమాలకోసం నవలలు రాసేవాడు. ఆయన నవల ఆధారంగా తీసిన సినిమాలు సూపర్ హిట్‌లు అయ్యేవి. 'షర్మీలీ ' అందుకు భిన్నం కాదు.

'షర్మీలీ' లో కథానాయిక రాఖీ, కవలలుగా ద్విపాత్రాభినయం చేసింది. ఒక రాఖీ అల్లరి చిల్లరి. మరో రాఖీ సిగ్గుతో, బిడియంతో ఎంతగా ముడుచుకుపోతుందంటే సరిగ్గా మాట్లాడలేదు కూడా. అందుకే ఆమె షర్మీలి. అల్లరి చిల్లరి రాఖీని కలసి ప్రేమించి పెళ్లి చేసుకోవాలనుకుంటాడు శశికపూర్. కానీ పెళ్లి రోజు ఆమె పారిపోతే ఆమె స్థానంలో ఆమెలాగే ఉండే షర్మీలీతో పెళ్లి చేస్తారు. నిజం తెలిసిన శశికపూర్ పాత్ర ఆమెను వదలి వెళ్లిపోతాడు. ఆ సందర్భంలో ఒంటరిగా, విషాదంలో, దుర్భర వేదనను అనుభవిస్తూ నిరాశ సముద్రం చుట్టు ముట్టగా అన్ని ఆశలు నశించి భవిష్యత్తు అన్నది లేని ఒక అంధకార స్థితిని అనుభవిస్తున్న సందర్భంలో పాడే పాట ఇది.

సినిమాలో దర్శకుడు 'షర్మిలీ' పాత్రను చక్కగా పరిచయం చేస్తాడు. ఆమె మంచిది. సున్నితమైన మనస్తత్వం కలది. కానీ మనసులోని మాట చెప్పలేదు. ఎవరితోనూ మాట్లాడలేదు. ఒంటరిగా చెట్లతో, గుట్టలతో, పశువులతో ఆడుతుంది, పాడుతుంది.

కానీ అందరూ ఆమెలాగే ఉన్నా చురుకుగా ఉండే ఆమెని కోరుకుంటారు కానీ షర్మిలీని ఎవ్వరూ ఇష్టపడరు. షర్మలీని పెళ్ళికోసం చూడటానికి వచ్చిన వారు కూడా ఆమెని కాదని ఆమె కవల సోదరిని పెళ్లి చేసుకుంటామంటారు. తల్లిదండ్రులు కూడా ఆమెని దూషిస్తుంటారు, అవమానిస్తారు.దాంతో ఆమె మరింతగా ముడుచుకుపోతుంది. ఇలాంటి పరిస్థితులలో అనుకోని పరిస్థితులలో ఆమెకు శశికపూర్ తో వివాహమవుతుంది. పెళ్లికి ముందే నిజం చెప్తూ ఓ ఉత్తరం రాస్తుంది. కానీ ఆ ఉత్తరం అతడికి చేరదు. దాంతో అన్నీ తెలిసే తనని పెళ్లి చేసుకుంటున్నాడని షర్మిలి సంతోషిస్తుంది. కానీ నిజం తెలుసుకున్న తరువాత 'అంతా మోసం' అని ఆమెని చీదరించుకుని ఆమె భర్త వెళ్లిపోతాడు. అందరూ ఆమెనే దూషిస్తుంటారు. ఆమె ఆనందం మూన్నాళ్ళ ముచ్చట అవుతుంది. ఆమె కన్న కలలు కల్లలవుతాయి. కలల సౌధం కూలిపోతుంది. అదీ ఈ పాట సందర్భం.

ఎస్డీ బర్మన్ ఇతర సంగీత దర్శకులకు భిన్నం. ఆయన సంగీతం కోసం రాచరికాన్ని సైతం కాలదన్నినవాడు. సంగీతం, తగిన సాహిత్యం ఉంటేనే పాట సంపూర్ణమవుతుందని నమ్మినవాడు. బొంబాయికి వచ్చిన కొత్తల్లో, హిందీ సరిగ్గా రాదని, హిందీ సాహిత్యం పరిచయం ఉన్న వాడిని సహాయ సంగీత దర్శకుడిగా నియమించుకుని, సాహిత్యపరంగా ఉత్తమ స్థాయిలో ఉన్న గీతాలనే బాణీ కట్టేందుకు ఎంచుకునేవాడు. అందుకే హిందీ సినీ ప్రపంచంలో ఉత్తమ గేయ రచయితలుగా పేరు పొందిన అత్యుత్తమ కవులు మాత్రమే ఎస్డీ బర్మన్‌కు పాటలు రాశారు. సాహిర్ లూధియాన్వీ, శైలేంద్ర, మజ్రూహ్ సుల్తాన్‌పురి, కైఫీ ఆజ్మీ వంటివారు ఎస్డీ బర్మన్ కు పాటలు రాశారు. అందుకే కవి నీరజ్ పరిచయం అయినపుడు కఠినమైన బాణీ ఇచ్చి పడికట్టు పదాలు వాడకుండా పాట రాయమని నిబంధనలు విధించి పరీక్షించాడు. ఆ పరీక్షలో ఉత్తీర్ణుడయిన తరువాతనే 'నీరజ్'ను గేయ రచయితగా ఎంచుకున్నాడు. ఎస్డీ బర్మన్ నీరజ్‌లు కలసి కేవలం నాలుగు సినిమాలకు పని చేశారు. ప్రేమ్ పూజారి, గ్లాంబ్లర్, తేరే మేరే సప్నే, షర్మిలీ. ఈ నాలుగు సినిమాలూ సూపర్ హిట్ పాటలకే కాదు సంగీతపరంగా, భాషాపరంగా అత్యంత సృజనాత్మకతకు పెట్టింది పేర్లు. వీరిద్దరి కలయికలో వచ్చిన 'ఆణిముత్యాల్లాంటి పాటలలో 'మేలిముత్యం' లాంటి పాట 'మేఘాఛాయే ఆధీ రాత్ బైరన్ బన్‌గయి నిందియా. '

సన్నివేశం విషాదమైనది. ఆర్తితో కూడుకున్నది. నాయిక పాత్రపై జాలి కలగాలి. ఆమె వేదనతో సహానుభూతిని పొందాలి ప్రేక్షకులు.

అందుకని హిందీ సినీ ప్రపంచంలో అతి అరుదుగా వాడే రాగం 'పట్‌దీప్' రాగాన్ని ఎంచుకున్నాడు ఈ పాటకు బాణీని కూర్చేందుకు ఎస్డీ బర్మన్. హిందీ సినీ సంగీత ప్రపంచంలో 'పట్‌దీప్' రాగం ఆధారంగా సృజించిన పాటలంటే నాలుగు పాటలను ప్రధానంగా చెప్తారు. సాజ్ హో తుం ఆవాజ్ హు మై (1966, నౌషాద్), తుం బిన్ జావూ కహా (1969, ఆర్డీబర్మన్), చుప్ కే చుప్ కే చల్‌రీ పురవయ్యా (1975, ఎస్డీబర్మన్). నాలుగవ పాట మేఘా ఛాయే ఆధీ రాత్ (1971)

పట్‌దీప్ రాగం సాధారణంగా తీవ్రమైన విరహవేదనను, నిశ్చల ధ్యాన స్థితిని ధ్వనిస్తుంది. ప్రియుడికి దూరమై పడే వేదన, ఉద్విగ్నత, నిరాశ, దుర్భరమైన దుఃఖాన్ని ధ్వనింపచేస్తుంది ఈ రాగం. అందుకని, ఈ పాటకోసం ఈ రాగాన్ని ఎంచుకున్నాడు ఎస్డీ బర్మన్. శుద్ధరాగాన్ని వాడుతూ రూపక తాళాన్ని ఎంచుకున్నాడు. ఇక్కడే ఎస్డీబర్మన్ చమత్కారం చేశాడు.

ఈ పాటలో రెండు విభిన్నమైన అంశాలు కలుస్తాయి. పాశ్చాత్య, భారతీయ సంగీతాలు కలుస్తాయి ఈ పాటలో. ఇద్దరు రాఖీలు కనిపిస్తారు. షర్మిలీ కనిపించినప్పుడు విషాదాన్ని ధ్వనించే శాస్త్రీయ రాగాన్ని వినిపిస్తాయి వాయిద్యాలు. అల్లరి చిల్లరి రాఖీ కనిపించేప్పుడు వేగాన్ని సంబరాలను సూచించే పాశ్చాత్య బాణీ ధ్వనులు వినిపిస్తాయి. ఈ రెంటినీ మిళితం చేస్తూ పాట సాగుతుంది. ఒక రాఖీ ఆనందంగా సంబరాలు చేసుకుంటూంటే, మరో రాఖీ కొండలు, చెట్లు, పచ్చిక బయళ్ల నడుమ ఒంటరిగా తన హృదయ వేదనను వినిపిస్తూ పాడుకుంటూంటూంది. మొదటి నుంచీ ఆమెకు స్నేహం ప్రకృతితోటే. కాబట్టి తన బాధను ప్రకృతితో చెప్పుకోవటం సమజసం, ఔచిత్యం కూడా. అంటే, అటు సంగీతంలోనూ, ఇటు చిత్రీకరణలోనూ ఔచిత్యం పాటించారన్నమాట. వీరిద్దరికి దీటుగా, పాట ప్రభావాన్ని ఇనుమడింపచేస్తూ గేయ రచన సాగించాడు నీరజ్.

నీరజ్ ప్రధానంగా పేరున్న కవి. అలీఘడ్‌లో ప్రొఫెసర్. ఆయన సినీగేయ రచన ఆరంభించినా, ప్రధానంగా కవిత్వ లక్షణాలతోనే గేయ రచన సాగించాడు. సందర్భాన్ని బట్టి హిందీ సినీగీతాలలో వినిపించని అతి చక్కని పదాలను వినిపిస్తూ సాగాడు. కవిత్వ వర్ణనలతో పాటలను నింపేవాడు. ఈ పాటను కూడా ఆరంభంలోనే ఆకట్టుకునేట్టు ఔచిత్యవంతంగా ఆరంభించాడు.

## మేఘా ఛాయే ఆధీ రాత్

## బైరన్ బన్‌గయీ నిందియా

పట్‌దీప్ రాగాన్ని రాత్రి రెండవ జాములో అంటే, రాత్రి 9గంటలనుండి 12 గంటల నడుమ ఆలపిస్తారు.

నాయికకు నిద్రరావటంలేదు. 'ఆధీరాత్' అన్న పదం వాడటంతో పట్‌దీప్ రాగాలాపనకు భూమిక ఏర్పాటయింది. 'మేఘాలు నిండిన అర్ధరాత్రి నిద్రదూరం అయింది,' అంటోంది నాయిక. మేఘాలు ఆకాశంలో అలుముకోవటం దుఃఖానికి సూచన. దుఃఖం నిండిన హృదయం ఆమెది. అందుకని నిద్రపట్టటం లేదు. ఆమె దుఃఖాన్ని ప్రకృతి కూడా ప్రతిబింబిస్తున్నది. అత్యద్భుతమైన కవితాత్మక గేయం ఇది. ఆకాశం హృదయానికి ప్రతీక. మేఘాలు దుఃఖానికి ప్రతీకలు. 'మేఘా ఛాయే' ఆధీరాత్ అంటే దుఃఖం నిండిన హృదయం.. ఇక నిద్ర ఎలా పడుతుంది? రాగం రాగానికి తగిన పదాలు, సందర్భోచితమైన భావం, భావాన్ని సరళంగా, కవితాత్మకతను వెలిబుచ్చే పదాలు.. ఇక వీటికి ప్రాణం పోసే స్వరం తోడవ్వాలి. దాంతో పాట సంపూర్ణమవుతుంది.

పాట ఎవరు పాడాలన్న విషయంలో ఎస్డీ బర్మన్‌ది మొండి పట్టుదల. ఆయన స్వయంగా గాయకుడు కావటంతో, గాయకుడి స్వరనాణ్యతను పసిగట్టి, ఏ పాటను ఎవరు అయితే బాగా పాడగలడో గ్రహించి ఆ పాటను వారితోనే పాడిస్తాడు ఎస్డీబర్మన్. ఈ విషయంలో రాజీ పడడు. అందుకే ఒకే సినిమాలో ఒకే నటుడికి పలువురు గాయకులు పాడతారు ఎస్డీబర్మన్ సంగీత దర్శకత్వం వహించే సినిమాలలో. ఇలా గాయకుడి శక్తిని, నైపుణ్యాన్ని గ్రహించి పాట పాడించటం వల్ల అనేక గాయనీగాయకుల పాటల జీవితంలో ఎస్డీబర్మన్ పాటలు కలికితురాయిల్లా నిలచిపోయాయి. ఈ పాటకు లతా మంగేష్కర్‌ను ఎంచుకోవటంతో పాట మరుపురాని గీతంగా ఎదగటం సంపూర్ణమయింది.

ఎస్డీబర్మన్‌కు లత గాన సంవిధానం తెలుసు. ఆమె మామూలు పదాలనుకూడా అర్ధవంతం చేసి భావస్ఫోరకంగా మలచగలదని తెలుసు. 'మేఘా ఛాయే' పాట లత స్వరంలో వింటూంటే, ఇతర గాయనిలు పాడటానికి, లత పాడటానికి తేడా స్పష్టంగా తెలుస్తుంది. ఇతర గాయనిల నడుమ లత హిమాలయ శిఖరంగా ఎందుకు నిలుస్తుందో బోధపడుతుంది.

రూపకతాళానికి సితార్ స్వరతంత్రులు తోడయి, మురళీరవంతో పాట ఆరంభమవుతుంది

'మేఘా ఛాయే' అనటంలో 'ఛాయే'ను ఒత్తి అంటుంది లత. మేఘా దగ్గరే 'మే' కూ 'ఘా' కూ నడుమ ఒక అతి చిన్న ముర్కీ తెలిసీ తెలియనట్టు వేస్తుంది. దాంతో  దుఃఖపు మేఘాలు అన్న భావన కలుగుతుంది.  'ఆధీరాత్' అనేటప్పుడు

'ఆధీ' దగ్గర ఆగీ ఆగనట్టు రాత్ వైపు దూకుతుంది. 'రాత్' లో రను ఒత్తి పలికి 'రాఆ' అన్న కణస్వరం వేసి వదిలలేనట్టు వదులుతుంది. ఎంత విషాదమయిన రాత్రి అది అన్న భావన కలుగుతుంది. 'రా ఆత్' అన్న లత 'బై' దగ్గర సెకన్లో వెయ్యవ వంతు ఆగి 'రనూ' అంటూ 'బన్ గయి 'లో 'బ'న్ ఒత్తి పలుకుతుంది. నిద్రరాని తనంలోని విసుగును, నిస్పృహను 'బైరన్ బన్గయి' లో 'బ' దగ్గర స్పష్టం చేస్తుంది. 'నిందియా' అనేపుడు స్వరం మంద్రమవుతుంది. ఒక రకంగా తలవంచుకుని క్రిందకు జారిపోతున్న భావన కలుగుతుంది. నిద్ర పేరు తలవటమే బాధాకరం అనిపిస్తుంది. నాయిక కూడా 'నిందియా' అనేటప్పుడు నిరాశ, నిస్పృహలతో తలవంచుకుంటుంది. నిద్రరాకపోవటం ఎంతటి దుర్భరమో, వేదనామయమో లత స్వరం 'నిందియా' దగ్గర స్పష్టం చేస్తుంది. అంతలో ఆక్రోషం. 'బతాదేమై' అని ఉచ్చ స్వరంలో విసుగ్గా బ్రతిమిలాడుతున్నట్టని 'క్యా కరూ' లో 'క్యా' దగ్గర ఒత్తిపలికి మళ్లీ నిద్రరాని నిస్పృహను, ఎంత ప్రయత్నించినా విఫలమవటాన్ని నొక్కి పలికి ప్రదర్శిస్తుంది. ఇలా ఒక్కొక్క పదాన్ని అర్ధవంతం, రసవంతం, భావస్ఫోరకం చేయగలిగిన గాయని లతా మంగేష్కర్. అందుకే లతా మంగేష్కర్ పాడే పాటలను మామూలుగా వింటే సరిపోదు, ప్రతి పదంలోని రసాన్ని పిండుకుంటూ, భావాల్ని అనుభవిస్తూ స్వరతరంగాల అలల శృంగాలపై ఎగురుతూ, లోయల్లోకి జారిపోతూ అమితమైన భావాల రసప్రవాహంలో ఉయ్యాలలూగుతూ, మనమే పాట అయిపోతూ వినాలి. ఇలా పాటను పాడే మరో గాయకుడు మహమ్మద్ రఫీ.

సబ్ కె ఆంగన్ దియా జలెరే, మోరే అంగన్ జియా

హవా లాగే శూల్ జైసీ, తానా మారే చున్రియా

ఆయీ హై ఆసూ కీ బారాత్,

బైరన్ బన్గయి నిందియా

బతా దే మై క్యాకరూ...

చక్కని శుభ్రమైన పదాలతో భావాన్ని వ్యక్తపరిచాడు కవి. అందరి ఇళ్లముందు దీపాలు వెలుగుతాయి. కానీ ఆమెఇంటి ముందు ముందు కాలేది ఆమె హృదయం. దియా, జియా చక్కని పదాలు. గాలి ఆమెను శూలంలాగా తాకుతోంది. ఆమె కొంగు ఆమెను హేళన చేస్తోంది. వెక్కిరిస్తోంది. వేదుతోంది. 'తానా మార్నా' అంటే తిట్టటం దూషించటం, వెక్కిరించటం, హేళన చేయటం వంటి అర్థాలు వస్తాయి. గాలి శూలం తాకిడిలా వేగంగా

వీస్తోంది. దానికి కొంగు ఎగిరి ఫడా ఫడా శబ్దం చేస్తూ తాకుతుంది. అది ఆమెకు 'తానా మార్నా'లా తోస్తోంది. కన్నీళ్లు కాల్వలు కట్టాయి. నేనేం చేయాలి, నిద్ర రావటం లేదు అంటోంది. లతా ఒక్కొక్క పదాన్ని పలికిన తీరును, తీసిన రాగాలను విశ్లేషిస్తూ పోతే ఒక పుస్తకమే అవుతుంది. రాగాలు తీయటంలో విషాదమే కాదు ఏడ్పు కూడా ధ్వనిస్తుంది. గాయకుడు స్వయంగా ఏడవకుండా, ఏడ్పును ధ్వనింపచేయటం అత్యుత్తమ గాన సంవిధానానికి నిదర్శనం. అందుకు ఈ పాట చక్కని తార్కాణం. 'క్యాకరూండూ' అనటంలో నేనేం చేయాలి అని ఏడుస్తున్న భావన ధ్వనింపచేస్తుంది.

'హవాలాగే' ఓ రకంగా అంటుంది. 'శూల్' దీర్ఘంతో పలుకుతుంది. 'తానామారే'లో ఎదుటి వాడి హేళనను తట్టుకోలేని బేలతనం ధ్వనిస్తుంది. ఇలా పాటను జాగ్రత్తగా వింటే లత స్వరతరంగాలు భావనల ప్రపంచాన్ని సృష్టించటం అనుభవిస్తాం.

**రూఠ్ గయెరే సప్నే సారే, టూట్ గయిరే ఆశా,**

**నైన్ బహే రే గంగా మోరే, ఫిర్‌భి మన్ హై ప్యాసా**

**కిసే కహు రే మన్ కీ బాత్**

**బేరన్ బన్ గయీ నిందియా**

మళ్ళీ సరళమైన పదాలతో కవి ఒక తీవ్రమైన నిరాశా నిస్పృహల దుర్భరమైన దుఃఖ చిత్రాన్ని చిత్రిస్తున్నాడు. ఆమె స్వప్నాలన్నీ దూరమైపోయాయి. ఆశాసౌధాలు విరిగిపోయాయి. ఆమె కంటనీరు పొంగుతోంది. కంటి నీరును 'గంగ'తో పోల్చటం అద్భుతమైన చమత్కారం. గంగానది ఎందరి దాహాన్నో తీరుస్తుంది. నేలను సారవంతం చేస్తుంది. ప్రజలకు ముక్తినిస్తుంది. భారతీయ సాంప్రదాయంలో నీటిని గంగలా భావిస్తారు. ఆమె కంట నీరు పొంగుతున్నా ఆమె మనసు మాత్రం దాహంతో తపిస్తోంది. మనసులో మాట చెప్పుకోటానికి ఎవరూ లేరు. ఇక నిద్ర ఎలా పడుతుంది.

ఈ చరణంలో పదాలకు ప్రాణం పోసి చైతన్యవంతం చేయటం, లత గాన సంవిధానంలో గమనించవచ్చు. 'రూఠ్' అన్నప్పుడు ఎవరో వేరైపోయిన వేదన ధ్వనిస్తుంది. 'సప్నెసారే'లో ఆక్రోషం వినిపిస్తుంది. ఆశా సౌధం విరిగిపోయిందన్నప్పుడు నిస్పృహ ధ్వనిస్తుంది.

'టూట్‌గయిరే ఆశా' నుంచి రాగం తీసి 'నైన్ బహెరే' చేరటం అద్భుతం అనిపిస్తుంది. 'కిసె కహూ'లో 'హూ' దగ్గర దీర్ఘం తీసి 'బాఆత్' అంటూ కణస్వరం వేయటంతో, మనసులో మాట చెప్పుకునేందుకు మనిషి లేదన్న ఒంటరి భావనతోపాటు, దుఃఖం ధ్వనిస్తుంది. 'బా ఆత్' అనటంతో మాట చెప్పుకునే మనిషి లేదని, నొక్కిచెప్తూ వెక్కి ఏడుస్తున్న భావన కలిగిస్తుంది.

పాట మధ్యలో మరో నాయిక కనిపించినప్పుడల్లా వినిపించే పాశ్చాత్య సంగీతం, వెంటనే నాయిక కనబడగానే వినిపించే విషాద శాస్త్రీయ సంగీతం పాటకు గొప్ప ఎఫెక్ట్‌నిస్తాయి. ముఖ్యంగా పాశ్చాత్య 'బీట్' శాస్త్రీయ సంగీత తాళంగా మారటం రెండు విభిన్నమైన భావాలను కలిగించి పాటలో విషాదాన్ని పెంచుతాయి. ప్రధాన పాత్రపై సానుభూతిని కలిగిస్తాయి. కవి, సందర్భోచితంగా పాటను రచించినా, అందరికీ వర్తించే రీతిలో పాటను రచించటంతో, బాధతో, వేదనతో ఉన్నవారు, ఒంటరివారు, నిద్రపట్టనివారు పాటను అనుభవిస్తూ, పాడుకుంటూ తమ స్థితికి అన్వయించుకుంటూ విషాదం లోతుల్లోని ఆనంద శిఖరాలను అనుభవించే వీలు కలుగుతుంది.

ఇలా ఆనంద, విషాదాలను ఒకటే పాటలో ప్రదర్శించటం 1949లో బర్సాత్ సినిమాలో శంకర్ జై కిషన్ ప్రథమంగా 'పత్లి కమర్ హై' పాటలో చూపించారు.

ఎస్డీబర్మన్‌ను గొప్ప సంగీత దర్శకుడిగా పరిగణించినా, ఆయన ఇతర బెంగాలీల పాటలను అనుకరించి బాణీలు రూపొందిస్తాడన్న అపప్రథ నుంచి మాత్రం తప్పించుకోలేదు. అద్భుతమైన 'మేఘాఛాయే' పాట 'లహో లహో తూలే లహో' అనే రవీంద్రగీతానికి అనుకరణ అంటారు. ఆ పాటలో ఈ పాట ఛాయలున్నా ఇది స్వతంత్ర గీతంగానే అనిపిస్తుంది. అంటే, కొంత స్ఫూర్తి పొందినా దానికి తన సృజనాత్మకతను జోడించి గీతాన్ని సృజించాడు ఎస్డీబర్మన్.

ఇది ఆనాటి కళాకారుల ప్రత్యేకత. వారు పట్టిందల్లా అత్యద్భుతమైన కళగా భాసిల్లింది. అత్యంత శ్రద్ధతో, చిత్తశుద్ధితో, తమ సృజనను సరస్వతీదేవికి అర్పించే పూలమాలలా భావించి సృజించారు కాబట్టే ఆనాటి పాటలు ఈనాటికీ సజీవంగా ఉండటమే వారు తరతరాలుగా నవతరాలను మెప్పిస్తూ సజీవ ప్రవాహంలా సాగిపోతున్నాయి, తరాల అంతరాలు లేకుండా.

(వచ్చే నెల మరిన్ని పాటలతో)

Click here to share your comments on this story